క్లుప్తంగా

శాస్త్రోక్తంగా హనుమద్ హోమం



హనుమద్ వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ హోమాన్ని అర్చకులు, పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించినట్టు ఈఓ ఆర్వీ చందన తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారని పేర్కొన్నారు. దేవస్థానంలో ప్రతి ఆదివారం హోమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

అయ్యప్ప ఆలయంలో భిక్ష



భిక్ష స్వీకరిస్తున్న అయ్యప్ప స్వాములు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం అయ్యప్ప స్వామి ఆలయంలో 11వ రోజు ఆదివారం జంగారెడ్డిగూడెంకు చెందిన వాగు నరసింహారావు, శ్రీదేవి దంపతులు, సరిపల్లికి చెందిన అంకం రాంబాబు అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటుచేశారని ఆలయ ట్రస్ట్ ప్రెసిడెంట్ చిన్ని వాసు స్వామి తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి కూన పార్వతి, గుంట్ల వెంకటేశ్వరరావు, కోర్లే పర కష్టారావు, తమ్మన వెంకటేశ్వరరావు, నెక్కలపూడి సూర్యచంద్రరావు, ఆలయ మేనేజర్ గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



నరసింహంకు బాండ్ పత్రాన్ని అందిస్తున్న కిషోర్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి భీమవరం పట్టణానికి చెందిన చల్లా శ్రీనివాస నరసింహం ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ కోటగిరి కిషోర్ విరాళం బాండ్ పత్రం అందించారు. దాత ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

వృద్ధురాలికి వీల్‌చైర్ అందజేత

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఓ వృద్ధురాలికి వీల్ చైర్ అందజేరు. కవులూరి మహేష్ దంపతులు, శక్తి ప్రసాద్ దంపతుల సౌజన్యంతో, ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థుల చదువుల నిమిత్తం, పేదింటి యువతుల వివాహాల నిమిత్తం ఆర్థిక సాయం చేస్తున్నామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

నేడు ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన

భీమడోలు: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భీమడోలు ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఈ నెల 13వ తేదీ ఉదయం 9.30 గంటలకు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమలా అన్ని ప్రాంతాల్లో తయారీ చేసి, ప్రజల ప్రాణాలను హరిస్తున్నందుకు గాను వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఏలూరు పార్లమెంట్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కారుమూరి సునీల్ కుమార్ హాజరవుతారన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అండర్‌పాస్‌లో విద్యుత్ సౌకర్యం ఏదీ?

దెందులూరు: దెందులూరు అలుగులగూడెం రైల్వే ట్రాక్ వద్ద నిర్మించిన అండర్‌పాస్‌లో రెండు వైపులా విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు ప్రయాణికులు పాదచారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అండర్‌పాస్‌లో ప్రతి రోజూ మూడు మండలాల ప్రజలు, రైతులు విద్యార్థులు, వ్యాపారస్తులు రాకపోకలు సాగిస్తారు. కోట్లాది రూపాయలతో అండర్‌పాస్ నిర్మించిన రైల్వేశాఖ అధికారులు రెండు వైపులా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రైల్వేశాఖ ఉన్నతాధికారులు పరిశీలించి రెండు వైపులా విద్యుత్ సౌకర్యం ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

చర్చికి ఆర్థిక సాయం

దెందులూరు: నూతనంగా నిర్మిస్తున్న సాల్వేషన్ ఆర్మీ మెయిన్ చర్చికి గ్రామానికి చెందిన దాత కొత్తపల్లి సురేష్ కుమార్, శోభ లాస్య, రోహిత్ ఆదివారం రూ.55 వేల నగదును స్థానిక కోర్ ఆఫీసర్ ఎం.రమణయ్యకు అందజేశారు. దాతలను సంఘ పెద్దలు పీఎస్ గాంధీ, రిటైర్డ్ ఆఫీసర్ జోషియా, సంఘస్తులు అభినందించారు.

వెదురుతో అద్భుత కళాఖండాలు



వెదురు కళాకృతుల ప్రదర్శన



సవర పెయింటింగ్స్ స్టాల్



సవర పెయింటింగ్

- ఆకట్టుకున్న హస్త కళా ప్రదర్శన
- గిరిజన విద్యార్థులకు వెదురు వస్తువుల తయారీపై శిక్షణ

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో డెవలప్‌మెంట్ కమిషనర్, కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆర్థిక సహకారంతో కోకో ట్రైబల్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థులకు చదువులతో పాటు చేతి వృత్తులపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శన ఆకట్టుకుంది. మూడు రోజుల ఈ ప్రదర్శనలో గిరిజన యువతి, యువకులు వెదురుతో తయారు చేసిన రకరకాల బుట్టలు, పూల దండలు, పెన్‌బాక్సులు, గోడ గడియారాలు, టీ, ట్రేలు, ఫొటో ఫ్రేమ్‌లు, లాంతర్ వస్తువులు, తాటి ఆకులతో తయారు చేసిన బొమ్మలు, బుట్టలు, గృహోపకరణలు తయారు చేసిన ప్రదర్శించారు. బట్టలపై రంగురంగుల దారాలతో, పూసలతో తయారు చేసిన వస్తువులు, సవర గిరిజన చిత్ర లేఖనం ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం మన్యం జిల్లాలు, ఒడిశా రాష్ట్రంలో సవర తెగకు చెందిన వారు ఇంటి గోడలపై ప్రకృతి, మనుషులు, జంతువులు వంటి రూపాలతో బొమ్మలు గీసిన చిత్రలు కనిపిస్తుంటాయి. సవర తెగ తమ జీవన విధానాన్ని, సంస్కృతిని సంప్రదాయాలను గీతల బొమ్మలతో తయారు చేసిన నేత చీరలు, ఫొటోలు ఈ ప్రదర్శనలో ప్రత్యేకంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థులకు ఈనెల 9వ తేదీ గురువారం నుంచి శనివారం రాత్రి వరకు వెదురు వస్తువు తయారీపై శిక్షణ ఇచ్చారు.

ఆన్‌లైన్‌లో కేడా వ్యాపారం



మాది సీతంపేట ఒడిశా సరిహద్దు గ్రామం. మా పూర్వీకుల నుంచి ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని సంప్రదాయక వాల్ పేయింట్లు వేసే వాళ్లం. దానిని లేపాక్షి అధికారులు ప్రోత్సహించారు. డ్రాయింగ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకుని బొమ్మలను కాగితాలు, వస్తువులు, చీరలపై వేసి వాటిని విక్రయిస్తున్నాం. వీటికి ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఆన్‌లైన్‌లో కేడా వ్యాపారం చేస్తున్నాం.

– వినోద్ కుమార్, సవర పెయిటింగ్ కళాకారుడు, సీతంపేట

ఆదాయం వస్తుంది



నేను కూలి పనులకు వెళ్లేదాన్ని. ఐటీడీఏ ద్వారా వెదురు కళాకృతుల తయారీలో శిక్షణ పొందాను. నాతో పాటు మరో 30 మంది మా గ్రామస్తులు శిక్షణ తీసుకున్నారు. వెదురు వస్తువులు ఎంతో అందంగా తయారు చేయడంతోపాటు వాటిని విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నాం.

– బి.పూర్ణ, వెదురు వస్తువుల తయారీ కళాకారిణి, పులిరామన్నగూడెం, బుట్టాయగూడెం మండలం

రోలర్ స్కేటింగ్ పోటీల్లో దార్విక్‌కు మెడల్స్



దార్విక్‌ను అభినందిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: పశ్చిమ గోదావజిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలో టి.నరసాపురం మండలం శ్రీరామవరం గ్రామానికి చెందిన విద్యార్థి బీరం దార్విక్ రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించాడు. ఈ మేరకు దార్విక్ తండ్రి ప్రతాప్ ఆదివారం విలేకర్లకు తెలిపారు. తాడేపల్లిగూడెంలో నాలుగు నుంచి ఆరేళ్ల వయస్సు గల బాలుర రోలర్ స్కేటింగ్ జిల్లా స్థాయి పోటీల్లో దార్విక్ ఉత్తమ ప్రతిభ కనబరిచి మూడో స్థానంలో నిలిచాడని చెప్పారు. దార్విక్‌ను గ్రామస్తులు అభినందించారు.

చెక్కల ర్యాంపు ధ్వంసం.. దెబ్బతిన్న రెయిలింగ్

- తూర్పు రాజగోపురంలో భక్తులకు గాయాలు
- రెయిలింగ్ ఇనుప బద్ది చీరుకుని బాలుడికి తీవ్ర గాయం



ప్రమాదాలకు కారణమైన రెయిలింగ్ ఇనుప బద్ది



చెక్కల ర్యాంపు వద్ద ఇబ్బంది పడుతున్న భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ తూర్పు రాజగోపురంలో దివ్యాంగ భక్తుల వీల్ చైర్లు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన చెక్కల ర్యాంపు, దాని ఇనుప రెయిలింగ్ దెబ్బతినడంతో భక్తులు గాయాలపాలవుతున్నారు. శనివారం సాయంత్రం దెబ్బతిన్న రెయిలింగ్ ఇనుప బద్ది చీరుకుని ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే. శ్రీవారి దర్శనానంతరం భక్తులు ఆలయం లోంచి తూర్పు రాజగోపురం మీదుగా బయటకు వెళ్తారు. దివ్యాంగులు ఇదే మార్గంలోంచి వీల్ చైర్లలో ఆలయంలోకి వెళ్లి వస్తుంటారు. అయితే వీల్ చైర్లు వెళ్లేందుకు వీలుగా గోపురంలో చెక్కలతో ర్యాంపు ఏర్పాటుచేసి, దానికి ఇరువైపులా స్టీల్ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. ఆ రెయిలింగ్ చివరి భాగం దెబ్బతిని, చెక్కలు విడిపోవడంతో వీల్ చైర్లు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. భక్తుల కాళ్లు చెక్కల మధ్యలో పడి నలుగుపోతున్నాయి. ఓ బాలుడు శనివారం సాయంత్రం ఆలయం లోంచి దెబ్బతిన్న రెయిలింగ్ మీదుగా బయటకు వెళుతున్న సమయంలో ప్రమాదవశాత్తు రెయిలింగ్ ఇనుప బద్ది చీరుకుంది. అతడి అరికాలికి తీవ్ర గాయమైంది. వెంటనే అక్కడున్న సెక్యూరిటీ సిబ్బంది ఆ బాలుడిని దేవస్థానం బ్యాటరీ కారులో ప్రథమ చికిత్సా కేంద్రానికి తరలించారు. దెబ్బతిన్న చెక్కల ర్యాంపు, రెయిలింగ్‌కు మరమ్మతులు చేయించాలని బాలుడి కుటుంబ సభ్యులు, భక్తులు అధికారులను కోరుతున్నారు.

హైవేపై వెలగని లైట్లు

కొయ్యలగూడెం: దేవరపల్లి – తల్లాడ జాతీయ ప్రధాన రహదారిలో బయ్యన్నగూడెం మీదుగా వెళ్లిన హైవేపై స్ట్రీట్ లైట్లు వెలగకపోవడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రారంభమైన డివైడర్ నుంచి చింతల రోడ్డు వరకు ఉన్న స్ట్రీట్ లైట్లు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో తరచూ గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతుంది. సమస్యను పంచాయతీ దృష్టికి తీసుకెళ్లగా, హైవే అధికారులకు ఫిర్యాదు చేయండని, అధికారులు చెబితే రోడ్డు నిర్వహణ కాంట్రాక్టర్‌ది బాధ్యతని నెలల తరబడి కాలం గడిపేస్తున్నారు. సమస్యపై ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదులు చేసినా పరిష్కారం లభించలేదం లేదని వాహనచోదకులు వాపోతున్నారు.

స్కూల్ బస్సుల్లో క్లీనర్లను నియమించాలి

కొయ్యలగూడెం: ప్రైవేటు స్కూళ్ల బస్సుల్లో క్లీనర్లను నియమించాలని సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు ఆదివారం ఒక ప్రకటనలో అధికారులను డిమాండ్ చేశారు. ఈ బస్సుల్లో పరిధికి మించి విద్యార్థులను ఎక్కించుకుంటున్నారని, డ్రైవర్లు ఇష్టానుసారంగా మితిమీరిన వేగంతో నడుపుతున్నారని, దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. అధిక ఫీజులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ బస్సుల నిర్వహణలో చూపడం లేదని, కాలం చెల్లిన బస్సులు నడుపుతున్నారని, పలు బస్సులకు మెట్లు ఎక్కి దిగే దగ్గర డోరు కూడా ఉండడం లేదని వివరించారు.

జూదరుల అరెస్ట్

లింగపాలెం: ధర్మాజీగూడెం గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేశామని, రూ.14900 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు. మండలంలో కోడిపందాలు, పేకాట శిబిరంపై సీఐ క్రాంతి కుమార్ పర్యవేక్షణలో ఉక్కుపాదం మోపామన్నారు. జూదక్రీడలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యం సీసాల స్వాధీనం

చింతలపూడి : పొనుకుమాడు గ్రామంలో బెల్ట్ షాపులపై ఆదివారం దాడులు నిర్వహించారు. పొనుకుమాడుకు చెందిన గంగుల తిరుపతయ్యను అదుపులోకి తీసుకుని, 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.అశోక్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎక్సైజ్ ఎస్సై జె.జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ కాళ్ల పంపిణీకి స్క్రీనింగ్ టెస్ట్



దివ్యాంగుల నుంచి కొలతలు సేకరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఏజెన్సీ లయన్స్‌క్లబ్, ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ సంయుక్తంగా దివ్యాంగులకు కృత్రిమ కాళ్ల పంపిణీకి స్క్రీనింగ్ టెస్ట్ శిబిరం స్థానిక లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. సుమారు 62 మంది దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి, వీరిలో 20 మందిని అనర్హులుగా గుర్తించినట్టు ఏజెన్సీ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ దాసరి శేషు తెలిపారు. అర్హుల నుంచి కొలతలు సేకరించామని, వీరికి 15 రోజుల్లో కృత్రిమ కాళ్లు ఉచితంగా అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కొండపల్లి పండు, మద్దిపాటి నాగేశ్వరరావు, హనుమంతరావు, అట్లూరి సురేష్, ఖండవల్లి ఆశీర్వాదం, మేడిచర్ల రవి, పంతగాని వెంకటన్న కోటేశ్వరరావు, ఏలూరు లయన్స్‌క్లబ్ కేవీ రాజు, కె.శ్రీనివాస్, చలసాని అరుణ్‌కుమార్, దేవినేని రమాదేవి, సరస్వతి, వాణి, కె.లక్ష్మికుమారి, ఖమ్మం రోటరీ క్లబ్ రంగారావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మరింత బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ శ్రీనురాజు

టి.నరసాపురం: వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గం సమన్వయకర్తగా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు నియమించడంతో పార్టీ మరింత బలోపేతమవుతుందని పార్టీ టి.నరసాపురం మండల కన్వీనర్ శ్రీను రాజు అన్నారు. టి.నరసాపురంలో సహకార సంఘం మాజీ చైర్మన్ దేవరపల్లి ముత్తయ్య నివాస గృహం వద్ద ఆదివారం సాయంత్రం ఆయన పలువురు మండల నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. బాలరాజు నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అహర్నిశలు కృషి చేయడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి ముత్తయ్యలతో పాటు జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, కాల్నీడి సుబ్బారావు, ఎంపీటీసీ నార్లపాటి వెంకట్రావు, నాయకులు ఒంటిపల్లి సుబ్రహ్మణ్యం, కటకం మల్లికార్జునరావు, సీతారాం ప్రసాద్, మాదంశెట్టి మల్లయ్య, నల్లూరి శ్రీనివాస్, కాశగాని సురేష్, భూబత్తుల రాంబాబు, చింతన వంశీ, రాతిపల్లి శ్రీను, సాయిల సత్యనారాయణ, నరదల రాజు, మోదుగు సుధాకర్, శీలం లాజర్, చిన్ని వెంకన్న, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చిరవెల్లి హైస్కూల్‌లో 2205-06 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

కుక్కునూరు: మండలంలోని చిరవెల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. 2005–06వ విద్యా సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు పాఠశాలలో కలుసుకుని, ఆటలు, పాటలు, నృత్యాలతో ఆనందంగా గడిపారు. నాటి స్మృతులను గుర్తచేసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చదివిన పాఠశాల పరిసరాలను, వారు చదువుకున్న తరగతి గదులను చూసి భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా నాటి గురువులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి హేయమైన చర్య



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ దాడి అత్యంత హేయమైన చర్య అని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ అన్నారు. గవాయ్‌పై దాడిని నిరశిస్తూ ఆదివారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తంచేశారు. సంతోష్ కుమార్ మాట్లాడుతూ గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిషోర్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎస్సీలపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సిర్రా భరత్ మాట్లాడుతూ ఈ దేశంలో సనాతన పేరుతో దౌర్జన్యాలు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని చెప్పారు. మత్తే బాబి, ఎరికపాటి విజయ్, కనికెల్లి మురళీకృష్ణ మాట్లాడుతూ 145 కోట్ల జనాభా యోగక్షేమాలతో జీవించాలంటే భారత రాజ్యాంగాన్ని, మానవ విలువలను, హక్కులను కాపాడాలి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోదుల స్వరూప్, పాము మాన్సింగ్, అంబటి నాగేంద్రప్రసాద్, కనికెల్లి రవి ప్రసాద్, కర్ణికోటి దిలీప్, రాగోలు సురేష్, రాజేష్, పల్లి విజయ్, ఎంపీటీసీ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక 43వ డివిజన్ కొత్తపేటలో ఏకేజీ సెంటర్లో గంగానమ్మ జాతర మహోత్సవాలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత మంగళ వాయిద్యాలు, మేళ తాళాలతో అమ్మవారికి చీర, సారెతో, 108 మంది మహిళ భక్తులు కలశాలతో నగర వీధుల్లో పాదయాత్రగా వెళ్లి గంగానమ్మవారికి, పోతురాజు బాబుకు స్నాన సంబరాలు నిర్వహించారు. మహిళలు పిండి వంటలు, పులిహోర, క్షీరాన్నం, చక్కెర పొంగలి, అరటి పండ్లు, కొబ్బరి కాయలు, పువ్వులు, పసుపు, కుంకుమలతో ఆలయానికి విచ్చేసి మొక్కులను చెల్లించుకున్నారు. ప్రధాన అర్చకులు భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. దావాల రంగ సత్యనారాయణ, జంపా సూర్యనారాయణ, కమిటీ సభ్యులు, డివిజన్ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన ఈ సంబరాల్లో అల్లంపల్లి మోహన్ రావు, ఉల్లింగుల సురేష్ పాల్గొన్నారు.

గంగానమ్మ ఆశీస్సులు నగర ప్రజలపై ఉండాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గ్రామ దేవత గంగానమ్మ ఆశీస్సులు నగర ప్రజలపై ఉండాలని వైఎస్సార్‌సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయ ప్రకాష్ (జేపీ) ఆకాంక్షించారు. స్థానిక బావిశెట్టి వారి పేట గంగానమ్మ సంబర మహోత్సవ కమిటీ ఆహ్వానం మేరకు ఆదివారం ఆయన అమ్మవారి సంబరంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సంబరాల నిర్వహణకు తమ సంపూర్ణ సహకారం అందిస్తామని జేపీ తెలిపారు. ఆయన్ని కమిటీ ప్రతినిధులు దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. జేపీ వెంట నాయకులు గుడిదేసి శ్రీనివాసరావు, నెరుసు చిరంజీవులు, భోగాది ప్రభాకర్, పాతినవలస రాజేష్, కొవ్విడి లక్ష్మణరావు, మద్దాల ఫణి తదితరులు పాల్గొన్నారు.

రైతన్న దేశానికి వెన్నెముక

దెందులూరు: రైతన్న దేశానికి వెన్నెముకని డీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. డీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో ఆదివారం నర్సింగ్ విద్యార్థులు జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. ఆట పాటలతో రైతుల వేషధారణలో నృత్యం చేస్తూ విద్యార్థులు ఆకట్టుకున్నారు. రైతుల కష్టం, రైతు పడే ఇబ్బందులను ఎన్ని సమస్యలు ఎదుర్కొన్నప్పటికీ ఎంతో ఖర్చుతో కూడుకున్నప్పటికీ జన జీవనానికి కావలసిన ఆహారాన్ని అందిస్తున్నారని విద్యార్థులకు తెలిపారు.

మద్యం సేవించి డ్రైవ్ చేయొద్దు

పెదపాడు: మద్యం సేవించి వాహనాలు నడపొద్దని ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. పెదపాడు మండలంలోని కలపర్రు టోల్‌గేట్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశమున్నందున వాహనాలు నడిపే సమయంలో మద్యం సేవించడం నేరంగా పరిగణించి అపరాధ రుసుం విధిస్తామని చెప్పారు. పెదపాడు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

18 నుంచి చెకుముకి పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 18వ తేదీ నుంచి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలు నిర్వహించనున్నట్టు జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు నవంబర్ 1న మండల స్థాయిలో, 23న జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో విజేతలకు డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ అనుమతితో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. పూర్తి వివారలకు, ప్రశ్న పత్రాలకు ఫోన్ నంబర్లు 82476 32961, 99896 32961, 70932 12999 సంప్రదించాలని తెలిపారు.